సాక్షి చిత్తూరు
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024



వలంటీర్ల రాజీనామా

బంగారుపాళెం మండలంలోని పలు పంచాయతీలో శనివారం 150 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. - 8లో



పక్కాగా పోలింగ్ కేంద్రాల పరిశీలన

జిల్లాలోని పోలింగ్ కేంద్రాలను పకడ్బందీగా పరిశీలించి మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. - 8లో



యథేచ్ఛగా 'కోడ్' ఉల్లంఘన

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. - 8లో

రోజుకో మెనూ.. ఇష్టంగా తిను!

పకడ్బందీగా జగనన్న గోరుముద్ద

- గత టీడీపీ పాలనలో ఉడికీ ఉడకని అన్నం, నీళ్ల సాంబారే గతి
- ఈ ఐదేళ్లలో ప్రభుత్వ బడుల్లో రోజుకో మెనూ
- తల్లిదండ్రులు, విద్యార్థుల హర్షం



రామకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో భోజనం వడ్డిస్తున్న దృశ్యం

ఈ చిత్రం చిత్తూరు జిల్లా, కుప్పం నియోజకవర్గం, రామకుప్పం జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం కింద భోజనం పెట్టించుకుంటున్న విద్యార్థులు. ఈ పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకు 237 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ 2019కు ముందు 145 మంది మాత్రమే విద్యార్థులు ఉండేవారు.అప్పటి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకానికి, బడుల బలోపేతానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో ఎన్‌రోల్‌మెంట్ పడిపోయింది. అప్పట్లో రోజూ ఒకేరకమైన మెనూ ఉండడంతో విద్యార్థులకు బలవర్థకమైన ఆహారం అందేది కాదు. 2019 తర్వాత సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజన పథకం రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. జగనన్న గోరుముద్ద పేరుతో ప్రభుత్వం వినూత్న పథకానికి పురుడుపోసింది. ఇది సూపర్ సక్సెస్ కావడంతో విద్యార్థులు రోజుకొక మెనూతో మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తింటున్నారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగింది.



వరదయ్యపాళెం జెడ్పీ హైస్కూల్‌లో..

ఈ చిత్రం తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, వరదయ్యపాళ్యం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకం. ఈ పాఠశాలలో 2019కి ముందు 256 మంది విద్యార్థులుండేవారు. గతంలో ఉడికీ ఉడకని అన్నం వడ్డించేవారు. నాసిరకం ఆహారం తినలేక విద్యార్థులు పస్తులుండేవారు. కోడిగుడ్లు కూడా ఇచ్చేవారు కాదు. ఇదే పాఠశాలలో ప్రస్తుతం రోజుకొక మెనూ అమలవుతోంది. నాణ్యమైన బలవర్థక ఆహారాన్ని విద్యార్థులు ఇష్టంగా తింటున్నారు. ఐరన్, కాల్షియం వంటి పోషకాలతో కూడిన రాగిజావను వారానికి మూడురోజులు తాగుతున్నారు. ప్రస్తుతం మధ్యాహ్న భోజనం చాలా బాగుందని ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఏటా విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం ఆ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 592 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.



తిరుపతి జిల్లా నరసింగాపురం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం పెడుతున్న దృశ్యం (ఫైల్)

ఫ్యాక్ట్ చెక్

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో 2019–24 విద్యా సంవత్సరంలో జగనన్న గోరుముద్ద పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేస్తోంది. ఎదిగే చిన్నారులకు పౌష్టికాహారం ఎంత ముఖ్యమో ఆలోచించిన ప్రస్తుత సీఎం గోరుముద్ద పేరుతో రుచికరంగా రోజుకో మెనూను అమలులోకి తీసుకొచ్చారు. చిన్నారులను మరింత ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దేందుకు అదనంగా రాగి జావా, చిక్కీలను అందజేస్తున్నారు. నాలుగంచెల విధానంలో సర్కారు బడుల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. దీనిపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా పచ్చపత్రిక విషం కక్కడంపై విరుచుకుపడుతున్నారు.

నాడు ఒకటే మెనూ..పెట్టిందే తిను!

గతంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నాసిరకం, ఉడికీ ఉడకని అన్నం పెట్టేవారు. రుచీపచీ లేని కూరలు వడ్డించేవారు. వారంలో అన్ని రోజులూ ఒకటే మెనూ ఉండేది. అలాంటి భోజనాన్ని విద్యార్థులు తినలేక బయట పడేసేవారు. బడికి కూడా సక్రమంగా వచ్చేవారు కాదు.


జగనన్న ఘోరముద్ద

ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం

ఉమ్మడి చిత్తూరు జిల్లా సమాచారం

సంవత్సరం	పాఠశాలలు	లబ్ధిపొందిన విద్యార్థులు	ఖర్చు చేసిన మొత్తం రూ.కోట్లల్లో
2021–22	4,805	3,18,212	45.28
2022–23 (చిత్తూరు జిల్లా)	2,458	1,62,856	26.13
2023–24 (చిత్తూరు జిల్లా)	2,461	1,63,170	32.36
2022–23 (తిరుపతి జిల్లా)	2,294	1,10,451	21.58
2023–24 (తిరుపతి జిల్లా)	2,294	1,45,013	38.15

నేడు వారానికి 15 రకాల వెరైటీలు

2019 నుంచి 2024 వరకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్కారు బడుల్లో గోరుముద్ద పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. వారానికి 15 రకాల వెరైటీలు, ఐదు రోజుల పాటు కోడిగుడ్డు, 3 రోజులు చిక్కీ, మూడు రోజుల పాటు రాగి జావను అందజేస్తున్నారు. ఇలాంటి మెనూ దేశంలోని ఏ సర్కారు బడుల్లోనూ అమలు కావడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, అయ్యోర్లు చెబుతున్నారు. సకాలంలో వంట సహాయకులకు జీతం, క్రమం తప్పకుండా గోరుముద్ద పథకం బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోంది.

గతంలో ఒకటే మెనూ



నేను ఒకటో తరగతి నుంచి ప్రభుత్వ బడిలోనే చదువుతున్నాను. నేను ప్రస్తుతం పి.కొత్తకోట పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాను. ఇప్పుడున్న మధ్యాహ్న భోజనం నేను ఐదో తరగతి చదివేటప్పుడు ఉండేది కాదు. గతంలో ఒకే రకమైన సాంబారు, ఉడకని అన్నం పెట్టేవారు. నేను అసలు స్కూళ్లో భోజనం తినేదాన్నే కాదు.

–చందనప్రియా, 9 వతరగతి, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

ఇప్పుడే బాగుంది



మా పాఠశాలలో మధ్యాహ్న భోజనం చాలా బాగా పెడతారు. రోజుకొక వెరైటీ ఉంటుంది. గతంలో కంటే ఇప్పుడే బాగుంది. భోజనానికి అనుకూలంగా డైనింగ్ హాల్స్ ఏర్పాటు చేశారు. గతంలో నాశిరకమైన ఆహారంతో పాటు కనీసం కూర్చోవడానికి స్థలం కూడా ఉండేది కాదు. నేను ప్రతిరోజూ పాఠశాలలోనే భోజనం తింటాను.

– వీణ, బాలికల జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా

బడిలో మినరల్ వాటర్



మా పాఠశాలలో ప్రతి రోజూ పోషకాలతో కూడిన భోజనం పెడుతున్నారు. రోజూ పెట్టే వెరైటీలు చాలా బాగాఉంటాయి. ఇలాంటి రుచికరమైన, నాణ్యమైన భోజనాలు గతంలో పెట్టేవారు కాదు. గతంలో అన్నం తినేటప్పుడు తాగునీరు కూడా ఉండేది కాదు. ఇప్పుడు మా పాఠశాలలో మినరల్ వాటర్ తాగుతున్నాను.

– హారిక, 9 వ తరగతి, బాలికల జెడ్పీ హైస్కూల్, కార్వేటినగరం, చిత్తూరు జిల్లా

నాకు పలావు అంటే ఇష్టం



మా పాఠశాలలో గతంకంటే ప్రస్తుతం నాణ్యమైన ఆహారాన్ని పెడుతున్నారు. ప్రతి సోమవారం హాట్‌హాట్‌గా పొంగల్, ఉడికించిన కోడిగుడ్డు, వెజిటబుల్ పలావు, గుడ్డు కూర, చిక్కీ పెడుతున్నారు. నాకు పలావు అంటే చాలా ఇష్టం. ఎంతో ఇష్టంగా తింటున్నా.

– సంపత్, 9వ తరగతి విద్యార్థి, పుత్తూరు, తిరుపతి జిల్లా

రాగిజావ చాలా బాగుంది



మా పాఠశాలలో అందజేస్తున్న రాగిజావ చాలా రుచికరంగా ఉంటోంది. వారంలో మూడు రోజుల పాటు రాగిజావ ఇస్తున్నారు. రెండో సారి వెళ్లి అడిగినా ఇస్తారు. గతంలో అన్నం, సాంబారు తప్ప ఇంకేమీ ఇచ్చేవారు కాదు. కోడిగుడ్డు ఒక్కోసారి ఇచ్చేవారు లేకపోతే అదికూడా లేదు.

– హేమశ్రీ, 8 వతరగతి, పుత్తూరు మండలం, తిరుపతి జిల్లా

వెజిటబుల్ అన్నం భలే ఇష్టం



మా బడిలో వెజిటబుల్ అన్నం పెడతారు. ఆ అన్నం అంటే నాకు చాలా ఇష్టం. చాలా రుచిగా ఉంటుంది. ఇంట్లో కంటే పాఠశాలలోనే బాగా ఉంటుంది. కోడిగుడ్డు, చిక్కీ కూడా క్రమంతప్పకుండా ఇస్తారు. రాగిజావ కూడా తాగుతాను. ఉడికించిన కోడిగుడ్డు తింటే ఎములకు బలాన్ని పెంచుతుందని మా మేడం చెప్పింది.

– భావన, 2 వ తరగతి, పూతలపట్టు మండలం, చిత్తూరు జిల్లా

న్యూస్‌రీల్

జాతీయస్థాయి పోటీలకు వెదురుకుప్పం విద్యార్థి



పోటీలకు ఎంపికైన గౌతమ్

వెదురుకుప్పం : జాతీయ స్థాయి సబ్ జూనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు వెదురుకుప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వీజీ గౌతమ్ ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని పీడీ రమేష్, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోషియేషన్ అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్ అభినందించారు.

మే 6 వరకు మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లింపులు

చిత్తూరు కలెక్టరేట్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ ఫీజు చెల్లించేందుకు మే 6 వ తేదీ వరకు అవకాశుందని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల స్టడీ సెంటర్ కో– ఆర్డినేటర్ మీరాసాహెబ్ తెలిపారు. శనివారం ఆయన విమాట్లాడుతూ 2018 నుంచి 2023కు చెందిన విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్షలకు రిజిస్ట్రేషన్, పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సంబంధిత సంవత్సరాల్లో బీఏ, బీకామ్, బీఎస్సీ అభ్యర్థులు ఫీజులు చెల్లించాలని కోరారు. మే 26 నుంచి జూన్ 1వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇతర వివరాలకు 7382929664, 9573607925 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎన్నికల ఖర్చులపై 'షాడో రిజిస్టర్'

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను అధికారులు నియోజకవర్గాల వారీగా షాడో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. ఈ లెక్కల ఆధారంగానే అభ్యర్థుల వ్యయాన్ని లెక్కించనున్నట్లు వ్యయ నియంత్రణ అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో తాము ఖర్చు చేసే మొత్తాన్ని ఎవరు చూస్తున్నారులే అని నిర్లక్ష్యంగా వ్యవహరించే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయి. షాడో రిజిస్టర్ నిర్వహణ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన అకౌంటింగ్ బృందాలు ఎన్నికలఅధికారి ఆధ్వర్యంలో ఉంటుంది. ఒకప్పుడు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 15 రోజులకు ఒకసారి సమర్పించే రికార్డులను పరిశీలకులు తనిఖీ చేసేవారు. ఇందుకు భిన్నంగా ప్రస్తుతం షాడో రిజిస్టర్ లెక్కలతో అభ్యర్థి వ్యయాన్ని సరి చూసుకోనున్నారు. దీంతో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ప్రతీ పైసాకు లెక్కలు చూపాల్సిన అవసరం ఏర్పడింది. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఖర్చులు ఆయా రాజకీయ పార్టీల పరిధిలోకి వస్తాయి. అభ్యర్థులు నామినేషన్ వేసే రోజు నుంచి ప్రచారంతో పాటు ఇతర ఖర్చుల మొత్తం ఆయా అభ్యర్థుల ఖాతాలోకి వెళ్లనున్నాయి. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అభ్యర్థులు రూ.40 లక్షలకు మించి ఖర్చు చేయకూడదు.

అలసత్వం వహిస్తే వేటే..!



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల విధులపై అలసత్వం వహిస్తే వేటు తప్పదని జేసీ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికలకు సంబంధించిన వివిధ బృందాలతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వర్తించే అన్ని బృందాలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి తనిఖీల్లో పట్టుబడే నగదు, ఇతర వస్తువుల పూర్తి వివరాలను అదే రోజు ఈసీఎంఎస్ సీజర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రచారంలో వినియోగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అనుమతి ఉందా, లేదా పరిశీలించాలని తెలిపారు. అనుమతులు లేకుండా తిప్పే వాహనాలను కచ్చితంగా సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ఆయా రాజకీయ పార్టీలు ప్రచార వాహనాలకు పొందిన అనుమతి పేపర్లను వాహనంపై అతికించాలని సూచించారు. బాణసంచా పేల్చేందుకు అనుమతులు లేవని, ఎవరైనా పేల్చితే కేసు నమోదు చేయాలని చెప్పారు. ఆయా పార్టీల అభ్యర్థులు నిర్వహించే ప్రచారాలు, సమావేశాలపై కట్టుదిట్టంగా నిఘా పెట్టాలన్నారు. హోమ్ ఓటింగ్ అభిప్రాయాలు తెలియజేసే ఫారమ్స్‌ను ఈ నెల 21వ తేదీ సాయంత్రం లోపు సేకరించాలని కోరారు. చిత్తూరు నియోజకవర్గం పరిధిలో 3 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, పోలీసు శాఖ పరిధిలో 18 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల అబ్జర్వర్లు క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రతి అంశాన్ని తనిఖీ చేస్తారని, అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని హెచ్చరించారు. సమావేశంలో చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, నగర పాలక కమిషనర్ అరుణ పాల్గొన్నారు.

ఆంధ్రుల ద్రోహి కిరణ్



- పదవి కోసం రాష్ట్ర విభజనకు సహకరించిన ద్రోహి కిరణ్
- వైఎస్ఆర్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు
- తాను తెలంగాణ వ్యక్తినంటూ అసెంబ్లీ సాక్షిగా కూతకూయలేదా?
- పుటపర్తి సాయిబాబా సంపద దోచుకుంది నిజం కాదా..
- సీఎం పదవి కోసం చిదంబరం కాళ్లు మొక్కలేదా..!
- సార్వత్రిక ఎన్నికల్లో కిరణ్‌కు డిపాజిట్ గల్లంతు ఖాయం
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సాక్షి తిరుపతి: ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీ కొట్టడంతో పదేళ్ల పాటు అజ్ఞాతంలో ఉండి తిరిగి బీజేపీ తరపున ఎంపీగా పోటీ చేస్తున్న ఆంధ్రుల ద్రోహి కిరణ్‌కుమార్‌రెడ్డికి డిపాజిట్ సైతం దక్కదని మంత్రి, పుంగనూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో పుంగనూరులో 30ఏళ్ల అభివృద్ధిని కేవలం ఐదేళ్లలో చేశానన్నారు. గతంలో పోలీసులపైనే దాడి చేసి పుంగనూరు అల్లర్లకు కారకుడైన వ్యక్తిని చంద్రబాబు టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం దారుణమన్నారు. తాను కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు సోనియాగాంధీ కాళ్లకే మొక్కలేదని, కిరణ్‌కుమార్‌రెడ్డి కాళ్లు పట్టుకున్నానని సిగ్గుమాలిన, అబద్ధపు మాటలు మాట్లాడడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డికి సన్నిహితంగా మెలుగుతూ ఆయన మరణానంతరం వైఎస్సార్ కుటుంబానికి వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు కిరణ్ అని మండిపడ్డారు. పదవీ వ్యామోహంతో వైఎస్ జగన్‌మోన్‌రెడ్డిని జైలులో పెట్టించి, రాష్ట్ర విభజనకు సహకరిస్తానని చిదంబరం కాళ్లకు మొక్కి సీఎం పదవి దక్కించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజనకు సహకరించి ఆంధ్రుల ప్రధాన ద్రోహిగా ముద్రవేసుకున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించి ఆ పార్టీకి వెన్నుపోటు పొడిచి బీజేపీలో చేరి రాజంపేట ఎంపీగా అభ్యర్థిగా నిస్సిగ్గుగా పోటీచేస్తున్నాడని విమర్శించారు. పుటపర్తి సాయిబాబా సంపదను దోచుకునేందుకు ఆయన చనిపోయి పది రోజుల గడచినా బతికే ఉన్నారని యావత్ ప్రపంచాన్ని మోసం చేసి భౌతిక కాయాన్ని అక్కడే ఉంచిన అమానవీయ నీచుడు కిరణ్‌కుమార్ రెడ్డి అని ఆరోపించారు. తాను తెలంగాణలోనే పుట్టానని, తాను తెలంగాణ వ్యక్తినే అని కిరణ్ కుమార్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఆయనను సొంత తమ్ముడే జిల్లా నుంచే తరిమేశారని వెల్లడించారు. సమైక్యాంధ్ర పార్టీ పేరుతో చెప్పులు మెడలో వేసుకుని, ఆఖరి బాల్ తనదేనని ఆంధ్రులను నట్టేట ముంచిన ద్రోహి కిరణ్ అని పెద్దిరెడ్డి మండిపడ్డారు.

పదవి కోసమే బాబు పోరాటం



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

పెనుమూరు(కార్వేటినగరం) : ముఖ్యమంత్రి పదవి కోసమే చంద్రబాబు పోరాటమని, ప్రజల అభ్యున్నతిని పట్టించుకోరని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం మండలంలోని నంజరపల్లె సచివాలయం పరిధిలో ఎంపీ అభ్యర్థి రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకుడు దయాసాగర్‌రెడ్డితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రజా సంక్షేమ విధ్వంసకుడు చంద్రబాబు జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. బాబుకు ఓటు వేస్తే రాష్ట్రంలో కరువు కాటకాలు తప్పవని, ప్రజలు వలస పోవాల్సిందే అని హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో ఓట్లు అడగడం మానేసి, కార్యకర్తలను రెచ్చగొడుతూ హింసా రాజకీయాలకు తెరతీస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన చంద్రబాబుకు లేదని, ఆయన ఆరాటమంతా తన కుమారుడు లోకేష్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టాలనే అని విమర్శించారు. ప్రజలకు మంచి చేసే వారంటే బాబుకు గిట్టదని, ఎదిరించిన వారిపై దాడులు చేయించడమే ఆయన నైజమని వివరించారు. పేదల సొమ్మును పెత్తందారులకు దోచిపెట్టేందుకు బాబు ఉబలాటపడుతున్నారని ఆరోపించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగనన్న గెలిపించి మరిన్ని సంక్షేమాలు అందుకోవాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబుకు ఓటమి తప్పదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఓట్ల కోసం అన్ని సామాజిక వర్గాలు బాబుకు అవసరమని, తర్వాత కమ్మ సామాజికవర్గానికే పదవుకు కట్టబెడతారని విమర్శించారు. సంక్షేమ ప్రదాన జగనన్నను ఎదుర్కొనే దమ్ములేక నాలుగు పార్టీలతో కలిసి ఎన్నికలకు వస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రజలు మాత్రం జగనన్న వెంటే ఉన్నారని తెలిపారు. బాబు ష్యూరిటీ రాష్ట్ర వినాశనానికి గ్యారెంటీ అని వెల్లడించారు. బీసీల పార్టీ అని గొప్పలు చెప్పడమే కానీ, టీడీపీ నుంచి ఏనాడైనా బీసీలను రాజ్యసభకు పంపించారా అని ప్రశ్నించారు. బాబు హామీలు మాటలకే పరిమితమని, తర్వాత నెరవేర్చేదే ఉండదని స్పష్టం చేశారు. పేద విద్యార్థినిని ఐక్య రాజ్యసమితికి పంపిన ఘనత ఒక్క జగనన్నకే దక్కిందని కొనియాడారు. ఎంపీపీ హేమలతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ అమీన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు యశోదారెడ్డి, యువత అధ్యక్షుడు లోకేష్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు గోవిందరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపే 'పది' ఫలితాలు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల ఫలితాలు ఈనెల 22వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ అధికారులు విడుదల చేయనున్నట్లు డీఈఓ దేవరాజు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్చి 18 నుంచి 30 వ తేదీ వరకు పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం మూల్యాంకనం పూర్తి చేసినట్లు వివరించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 11 గంటలకు పదోతరగతి పరీక్షల ఫలితాలు విడుదలవుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

యథేచ్ఛగా 'కోడ్' ఉల్లంఘన



బంగారుపాళెంలో మసీదు వద్ద డిజిటల్ వాహనం ద్వారా టీడీపీ ప్రచారం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని మసీదు వద్ద టీడీపీ నేతలు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావ్ తరఫున స్థానిక జామియా మసీదు ఎదురుగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద డిజిటల్ ప్రచార వాహనం ద్వారా చిత్రాలను ప్రదర్శిస్తూ పెద్ద శబ్దంతో పాటలు పెట్టారు. సాయంత్రం నమాజు సమయం కావడంతో ప్రార్థనలకు ఇబ్బందిగా ఉందని ముస్లింలు వాహనం వద్దకు వచ్చి అభ్యంతరం తెలపడంతో అక్కడి నుంచి వాహనాన్ని మరో ప్రాంతానికి తీసుకు వెళ్లారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఆలయాలు, పాఠశాలలు, మసీదులు వద్ద ప్రచారాలు నిర్వహించకూడదని చెబుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

విద్యుత్ స్తంభాలకు జెండాలు

సదుం: మండలంలోని కంభంవారిపల్లె పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారు. విద్యుత్ స్తంభాలకు, గ్రామాల పేర్లు తెలిపే బోర్డులకు టీడీపీ జెండాలను కట్టారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పక్కాగా పోలింగ్ కేంద్రాల పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాలను ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు స్వయంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల కసరత్తుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ జరిగే రోజున ప్రతి పోలింగ్ కేంద్రంలో బారికేడ్లు, షామియానా, తాగునీరు, తదితర సౌకర్యాలను పక్కాగా ఏర్పాటు చేయాలని సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. ఒక్కో బస్సులో ఐదు పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఎన్నికల సామగ్రి తీసుకెళ్లాని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో తప్పనిసరిగా ఫారమ్- 1 పబ్లికేషన్ సర్టిఫికేట్లు ప్రచురించాలన్నారు. నియోజకవర్గాల్లో ఈవీఎంలను భద్రపరిచే గోడౌన్‌లను పోలీసులతో కలిసి పరిశీలించాలని కోరారు. మే 3,4 తేదీల్లో పీఓ, ఏపీఓలకు, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 28వ తేదీన పీఓ, ఏపీఓల ర్యాండమైజేషన్ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలకు బృందాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. మే 5వ తేదీన పోస్టల్‌బ్యాలెట్ వినియోగించుకునేందుకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ఫారమ్-12 కసరత్తుకు సంబంధించి ఈ నెల 24వ తేదీ లోపు వివరాలు పూర్తి చేయాలని తెలిపారు. ఖర్చుల వివరాలు తప్పనిసరిగా షాడో రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక

- సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలి
- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని అధికారులను జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం చైర్మన్ చాంబర్‌లో ఎన్నికల నిబంధనలకు లోబడి జెడ్పీ స్థాయి సంఘాల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తక్షణమే స్పందించి పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాల అడుగంటి పోవడంతో పరిస్థితి కష్టంగా మారిందని, ఈ ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

ట్యాంకర్ల ద్వారా సరఫరా

జిల్లాలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఎక్కడైన బోర్లు మరమ్మతు అయితే వెంటనే బాగు చేయిస్తున్నమన్నారు. నీటి ఎద్దడి తలెత్తనున్న ప్రాంతాల నివేదికను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. అవసరమైతే ఆ ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీఈవో గ్లోరియా మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని విధిగా పాటించాలని చెప్పారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. వడదెబ్బ మరణాలను త్రీ మెన్ కమిటీ నిర్ధారించి సర్టిఫికెట్ ఇస్తుందని పేర్కొన్నారు. నీటి నిల్వల పై తప్పనిసరిగా మూతలు ఉండాలని, లేదంటే దోమలు చేరుతాయన్నారు. తద్వారా పలు వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. అతిసారం రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌సీల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. సమావేశాల్లో జెడ్పీ వైస్ చైర్మన్లు ధనుంజయరెడ్డి, రమ్య, మహిళ శిశు సంక్షేమశాఖ కమిటీ చైర్మన్ భారతి, పలు జిల్లా శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



బంగారుపాళెం సచివాలయ వద్ద రాజీనామా పత్రాలతో వలంటీర్లు

బంగారుపాళెం : టీడీపీ, జనసేన నేతల వేధింపులు, అనుచిత వ్యాఖలకు మనస్తాపం చెంది శనివారం మండలంలోని 150 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. బంగారుపాళెం,1,2, తగ్గువారిపల్లె, పాలేరు, మొగిలి, మొగిలివారిపల్లె, నల్లంగాడు, మహాసముద్రం గ్రామ సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఆయా గ్రామ కార్యదర్శులకు రాజీనామా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిస్వార్థంగా పేదలకు సేవలందిస్తుంటే టీడీపీ, జనసేన నేతలు అసత్య ఆరోపణలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వలంటీర్ వ్యవస్థపై నిత్యం విషం కక్కుతున్నారని మండిపడ్డారు. అందుకే రాజీనామాలు చేశామని, ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా సేవలందిస్తామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీలోకి 40 కుటుంబాలు



వైఎస్సార్‌సీపీలో చేరిన కేసీ కండ్రిగ టీడీపీ నాయకులు, కార్యకర్తలు

బంగారుపాళెం: బంగారుపాళెం మండలం నలగాంపల్లి పంచాయతీ పరిధిలోని కేసీ కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన 40 కుటుంబాలు శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ సునీల్ కుమార్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్సార్‌సీపీలో చేరిన వారిలో వెంకటముని, నాగరాజు, దూర్వాసులు, మొగిలేష్, పంకజ, దనశేఖర్, చిన్నరాజయ్య, పయణి తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు

పెద్దపంజాణి: మండలంలోని కత్తార్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు వెంకటరెడ్డి, ఎస్.మణి, చెంగప్ప, జి.మంజునాథ్ శనివారం వారి అనుచరులతో ఎమ్మెల్యే వెంకటేగౌడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జగనన్న సంక్షేమ పాలన నచ్చి పార్టీలో చేరినట్లు వారు చెప్పారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.



టీడీపీ నేతలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

మూడో రోజు 9 మంది నామినేషన్



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందిస్తున్న అభ్యర్థి కళత్తూరు ప్రతిభాగాంధీ.



నామినేషన్ వేస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి శోభ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జిల్లా వ్యాప్తంగా శనివారం మూడవ రోజు 9 మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి ఎన్.శోభ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారికి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటి వరకు చిత్తూరు ఎంపీ సెగ్మెంట్‌కు ఐదుగురు అభ్యర్థులు, 8 నామినేషన్లు సమర్పించారు. అలాగే జీడీ నెల్లూరు అసెంబ్లీ నియోజకవర్గానికి కళత్తూరు ప్రతిభాగాంధీ (వైఎస్సార్‌సీపీ, ఏ-బీ ఫారాలు ఇవ్వలేదు), రత్నవేల్ గాంధీ (టీడీపీ, ఏ-బీ ఫారాలు ఇవ్వలేదు) నగరి నియోజకవర్గం- వి.సరిత (సమాజ్‌వాదీ పార్టీ), చిత్తూరు- వి.తేజేష్ (ఇండిపెండెంట్), పూతలపట్టు- ఏ.పురుషోత్తం (సమాజ్‌వాదీపార్టీ), పలమనేరు- సి.ఉమాశంకర్‌రెడ్డి (ఇండిపెండెంట్), ఆర్.శోభ (బహుజన్ సమాజ్‌పార్టీ), బి.శివశంకర్ (కాంగ్రెస్, ఏ,బీ ఫారాలు ఇవ్వలేదు) నామినేషన్లను ఆయా రిటర్నింగ్ అధికారులకు అందజేశారు.

సోదరికి బాసటగా ప్రతిభాగాంధీ



నియోజకవర్గం	: జీడీనెల్లూరు	నగదు	: రూ.10 లక్షలు
అభ్యర్థి	: కళత్తూరు ప్రతిభా గాంధీ	భవనాల విలువ	: రూ.2.75 కోట్లు
పార్టీ	: వైఎస్సార్‌సీపీ	బంగారం	: 600 గ్రాములు
విద్యార్హత	: బీటెక్	అప్పులు	: రూ.1.82 కోట్లు
స్థిరాస్తి	: లేదు	కేసులు	: లేవు

కాంగ్రెస్ అభ్యర్థి ఆస్తులు రూ.కోటి



నియోజకవర్గం	: పలమనేరు	స్థిరాస్తులు	: రూ.50లక్షలు
అభ్యర్థి	: బి.శివశంకర్	బంగారం	: 1.41లక్షలు
పార్టీ	: కాంగ్రెస్	చరాస్తులు	: 50 లక్షలు
విద్యార్హత	: ఇంటర్	అప్పులు	: 32లక్షలు
భార్య పేరిట నగదు: రూ. లక్ష		కేసులు	: లేవు

పలమనేరులో శనివారం మూడు నామినేషన్లు

పలమనేరు : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శనివారం పలమనేరు శాసనసభ స్థానానికి మూడు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి మనోజ్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నుంచి బి. శివశంకర్, బీఎస్పీ నుంచి ఆర్.శోభ, ఇండిపెండెంట్‌గా ఉమామహేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేసినట్లు వెల్లడించారు.

పలమనేరులో రూ.2 కోట్లకు ఐపీ

పలమనేరు : పట్టణంలోని కేవీఎస్ స్ట్రీట్‌కు చెందిన ఉదయ్‌కుమార్ అనే వ్యక్తి స్థానిక సీనియర్ సివిల్ కోర్టులో రూ.2 కోట్లకు శనివారం ఐపీ పెట్టినట్టు తెలిసింది. తాను 33 మంది వద్ద తీసుకున్న రూ.2కోట్ల అప్పును తీర్చలేనని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయం శనివారం వెలుగు చూడడంతో పట్టణంలో అతనికి అప్పులిచ్చిన వారు లబోదిబో మంటున్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

చిత్తూరు అర్బన్: నగరంలో గంజాయి విక్రయిస్తున్న కుమార్ (45) అనే వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. సంతపేట నీవానది పరివాహక ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. రంగాచారివీధికి చెందిన కుమార్ గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.